# సాక్షి అనంతపురం

సోమవారం ⋅ 4 ⋅ డిసెంబర్ ⋅ 2023






**టమాట కిలో రూ.20**

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ. 20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



**కార్తికేయ.. నమోనమః**

పంపనూరు పుణ్యక్షేత్రంలో ఆదివారం తులసీ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తరించారు.

10లో

గరిష్టం/కనిష్టం

30.2°/ 19.6°

జిల్లాలో ఆదివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. తుపాను ప్రభావంతో పగలంతా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. వాయువ్య దిశగా గంటకు 6-10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



దివ్యాంగులతో మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

**అనంతపురం రూరల్:** దివ్యాంగులు అన్ని రంగాల్లోనూ రాణించాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఖాళీగా ఉన్న బ్యాక్‌ల్యాగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లినపుడే రాణించగలరన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



గాయాలపాలైన చిన్నారి

**బుక్కరాయసముద్రం:** కుక్క దాడిలో చిన్నారికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని జనచైతన్య నగర్‌లో నివాసముంటున్న షేక్ మహమ్మద్ కుమారుడు సల్మాన్ (పద్దెనిమిది నెలలు) ఇంటి బయట ఉండగా వీధి కుక్క దాడి చేసింది. చిన్నారి అరుపులు విన్న స్థానికులు అక్కడకు వచ్చి కుక్క బారి నుంచి రక్షించారు. అనంతరం సల్మాన్‌ను కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### 6న వేరుశనగ చెక్క వేలం


**బుక్కరాయసముద్రం:** రెడ్డిపల్లి వద్దనున్న జిల్లా జైలులో ఈ నెల ఆరో తేదీన వేరుశనగ చెక్క వేలం పాట నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రెహ్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాజైల్లో ప్రాంతీయ జైళ్లశాఖ ఉప శాఖాధికారి సమక్షంలో బుధవారం ఉదయం 11 గంటలకు 25 వేల కేజీల వేరుశనగ చెక్క వేలం వేస్తారని, పాల్గొనదలచిన వారు రూ.22వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కు చెల్లిస్తామన్నారు.

### సంతల ఆదాయం రూ.3.44 లక్షలు



**అనంతపురం అగ్రికల్చర్:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.44 లక్షలకుపైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్ బాషా, సెక్రెటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,98,140, ఆదివారం పశువుల సంత నుంచి రూ.1,46,650 మేర వసూలైనట్లు వెల్లడించారు.

### హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

**అనంతపురం:** జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి ఎస్.శివశంకర్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇందులో ప్రతిభ చాటిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను ఎంపిక చేశారు. వీరు గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.

# కాలం కరిగి.. కెరీర్ ముగిసి

- జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్న రవిచంద్ర..సెల్‌ఫోన్‌కు బానిసై సబ్జెక్టులన్నీ ఫెయిలయ్యాడు. ఇప్పుడు సెల్‌ఫోన్ లేకుండా ఉండలేడు. మానసిక రోగిలా తయారు కావడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.
- అనంతపురంలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీ ఫార్మసీ చదువుతున్న సౌజన్య పరిస్థితీ అంతే. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ అబ్బాయిని లవ్ చేసింది. చివరకు అతను మోసం చేశాడు. ఆత్మహత్యాయత్నం చేసింది.



**యువతను ముంచేస్తున్న సామాజిక మాధ్యమాలు**

- రోజుకు సగటున 3 గంటల సమయం వృథా
- ఉమ్మడి జిల్లాలో 5 లక్షల మంది యువతపై సెల్‌ఫోన్ ప్రభావం
- కెరీర్‌పై తీవ్ర దుష్ప్రభావం.. యుక్త వయసులోనే మానసిక రుగ్మతలు
- కోలుకోలేని దెబ్బ తీస్తున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్‌ల వినియోగం

**ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాధ్యమాల ప్రభావం (వయసుల వారీగా)**

| వయసు | జనాభా శాతం | జనాభా | మొబైల్ మాధ్యమాల ప్రభావితులు |
|---|---|---|---|
| 18 | 2.22 | 97,649 | 60 శాతం |
| 19 | 1.80 | 79,649 | 63 శాతం |
| 20 | 2.58 | 1,13,370 | 75 శాతం |
| 21 | 1.65 | 72,683 | 74 శాతం |
| 22 | 1.93 | 85,119 | 71 శాతం |
| 23 | 1.67 | 73,672 | 70 శాతం |
| 24 | 1.78 | 78,197 | 69 శాతం |
| 25 | 2.72 | 1,19,801 | 71 శాతం |

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** సమయం చాలా విలువైనది.. ఎప్పుడు ఏమి చేయాలో అది అప్పుడే చేయాలి.. తరచూ కెరీర్ కౌన్సిలర్ల నుంచి తల్లిదండ్రులు, టీచర్లు చెప్పేమాట. కానీ ఈ తరం యువత దీన్ని చెవికెక్కించుకున్నట్టు లేదు. సామాజిక మాధ్యమాల పుణ్యమా అని కాలం అరచేతిలోనే కరిగిపోతున్నా కిమ్మనకుండా తాత్కాలిక ఆనందం పొందుతున్నారు. మాధ్యమాల ఉచ్చులో పడి కెరీర్‌ను తృణప్రాయంగా పోగొట్టుకుంటున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించాల్సిన సమయంలో మాధ్యమాల ప్రభావంతో నిరుద్యోగిగా మారిపోతున్న తీరు ఇప్పుడు తల్లిదండ్రులకు కన్నీళ్లు తెప్పిస్తోంది.

**ఫేస్‌బుక్..ఇన్‌స్టా..వాట్సాప్**

ఎక్కడ చూసినా ఇప్పుడు పైన చెప్పుకున్న మూడే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల యువతీ యువకుల్లో ఈ వ్యసనం తలకెక్కింది. సగటున రోజుకు 3 నుంచి 4 గంటల సమయం దీనికే గడుపుతున్నట్టు తాజా అంచనా. చివరకు పరీక్షల ముందు సబ్జెక్టులు చదవాల్సిన వాళ్లు కూడా ఫేస్‌బుక్ అనే పద్మవ్యూహంలో ఇరుక్కుని బందీలుగా మారారు. రోజుకు 3 గంటలు అంటే నెలకు 90 గంటలు.. అంటే సుమారు నాలుగు రోజులు.. ఏడాదికి 48 రోజుల విలువైన సమయం హారతి కర్పూరంలా కరిగిపోతోంది.

**ఓ వైపు కెరీర్ సమాప్తం.. మరోవైపు మానసిక ఆందోళన**

సాధారణంగా 22 సంవత్సరాలకు గ్రాడ్యుయేషన్ పూర్తవుతుంది. పీజీ వంటివి చేసినా 25 ఏళ్లకు చదువులు పూర్తయి ఉద్యోగం తెచ్చుకోవాల్సిందే. కానీ ఇక్కడ సెల్‌ఫోన్‌కు బానిసై 27 ఏళ్లు వచ్చినా డిగ్రీ సబ్జెక్టులే పూర్తి కావడం లేదు. దీంతో కెరీర్ చేజేతులా పోవడమే కాదు..మానసిక జబ్బులకు గురవుతున్నారు. మానసిక జబ్బుల బాధను అధిగమించేందుకు దుర్వ్యసనాలకు లోనవుతున్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్, సిగరెట్లు ఇలా రకరకాల దుష్ప్రభావాలు వారిని నిలువునా ముంచేస్తున్నాయి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన యువత 27 ఏళ్ల లోపే మానసిక వైద్యుల వద్దకు క్యూ కడుతున్నారు.

**అత్యంత ప్రభావితమైన వయసులో..**



18 నుంచి 27 ఏళ్ల లోపు వయసు అనేది అత్యంత ప్రభావవంతమైనది. మానసికంగా మంచి పరిణతి సాధించే వయసు. ఈ సమయంలో ఏకాగ్రతతో ఉంటే కెరీర్ మొత్తం బాగుంటుంది. డిగ్రీ చదివే సమయంలో పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇవ్వకూడదు. పైగా వారి కదలికలపై తల్లిదండ్రుల నిత్యం పరిశీలన ఉండాలి. స్మార్ట్ ఫోన్ వల్ల సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే అవకాశం కూడా ఉంది. అకడమిక్ పరంగా మాత్రమే ఇంటర్నెట్ ఉపయోగించాలి. – ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ, అనంతపురం రేంజ్

**వ్యసనంగా మారుతున్న అలవాటు**



సెల్‌ఫోన్ అనేది తొలుత అలవాటుగా మారి ఆ తర్వాత వ్యసనమవుతోంది. దీనివల్ల చదువుపై పెట్టాల్సిన శ్రద్ధ మొబైల్‌పై పెడతారు. రాను రాను దీనికి బానిసై ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వరకూ వెళతారు. మానసికంగా కుంగిపోయి మా దగ్గరకు వస్తారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి ఉంటుంది. చదువుకునే వయసులో వీలైనంత వరకూ మొబైల్‌కు దూరంగా ఉండటమే దీనికి సరైన మందు. అంతకు మించి మరొకటి లేదు. – డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు

## ప్రశాంతంగా కౌన్సెలింగ్

- రెండు ఎస్ఓ, 15 పీజీటీ పోస్టుల భర్తీ
- రోస్టర్ మేరకు మూడో అభ్యర్థితో తక్కిన పోస్టుల భర్తీకి చర్యలు



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు

**అనంతపురం ఎడ్యుకేషన్:** కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్, పీజీటీ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) పోస్టులు, 15 పీజీటీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఇటీవల రిక్రూట్‌మెంట్ చేసిన సమయంలో తయారు చేసిన 1:3 మెరిట్ జాబితాలోని రెండో అభ్యర్థికి అవకాశం కల్పించారు. వివిధ రోస్టర్లలో అభ్యర్థులు లేకపోవడంతో వాటిని ఖాళీగానే ఉంచారు. సమగ్రశిక్ష ఏపీసీ జూలుకుంట వరప్రసాదరావు ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 37 పోస్టులకు గాను 17 పోస్టులను భర్తీ చేశారు. సీనియార్టీ ప్రకారం ఆయా ఖాళీలను భర్తీ చేశారు. ఏపీసీ చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. సోమవారం విధుల్లో చేరాలని ఆదేశించారు. కాగా తక్కిన పోస్టులను 1:3 జాబితాలోని మూడో అభ్యర్థితో రోస్టర్‌ను అనుసరించి సోమవారం భర్తీ చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో గుత్తి డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, జీసీడీఓ మహేశ్వరి, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భర్తీ అయిన పోస్టులు ఇవే...**

ఆదివారం నాటి కౌన్సెలింగ్‌లో ప్రిన్సిపాల్ పోస్టులు 2, పీజీటీ బాటనీ 1, పీజీటీ కెమిస్ట్రీ 1, పీజీటీ సివిక్స్ 2, పీజీటీ ఎకనామిక్స్ 3, పీజీటీ ఇంగ్లిష్ 2, పీజీటీ మ్యాథ్స్ 2, పీజీటీ ఫిజిక్స్ 2, పీజీటీ జువాలజీ 2 పోస్టులు భర్తీ చేశారు.

# సామాజిక సాధికార స్వరం



రాప్తాడులో సామాజిక సాధికార యాత్రకు స్వాగతం పలుకుతూ వెలిసిన ఫ్లెక్సీలు

- నేడు రాప్తాడులో సామాజిక సాధికార సభ
- హాజరుకానున్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు
- ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైన ప్రజలు

**రాప్తాడు:** జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులు, జరిగిన అభివృద్ధిని వివరించేందుకు వైఎస్సార్‌సీపీ తలపెట్టిన మూడో విడత సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడుకు చేరుకోనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభలో గత టీడీపీ ప్రభుత్వం పేదలకు చేసిన మోసాన్ని ఎండగట్టనున్నారు. సీఎం జగన్ కులమతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు అన్ని సామాజిక వర్గాలకూ రాజకీయంగా ప్రాధాన్యమివ్వడాన్ని వివరించనున్నారు. సామాజిక సాధికారత పేరుతో చేపడుతున్న బస్సు యాత్రకు నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. సామాజిక చైతన్యంతో సాధికార స్వరం వినిపించనున్నారు.

**రాప్తాడులో బైక్ ర్యాలీ..**

రాప్తాడులో సోమవారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి యువత భారీగా తరలిరానుంది. బైక్ ర్యాలీని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తారు. బస్సు యాత్ర ముందు బైక్ ర్యాలీ సాగుతుంది. ర్యాలీలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొననున్నారు.

**బస్టాండు సర్కిల్లో బహిరంగ సభ..**

రాప్తాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర మధ్యాహ్నం 3 గంటలకు బస్టాండు సర్కిల్ చేరుకోనుంది. అక్కడి నుంచి డాన్ బోస్కో స్కూల్, ఆర్డీటీ కార్యాలయం, సెరికల్చర్ కార్యాలయం మీదుగా గంగలకుంట రోడ్డు, 44వ జాతీయ రహదారి మీదుగా వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంటుంది. అక్కడ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించనున్నారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా బహిరంగ సభ జరుగుతుంది.

**హాజరు కానున్న ప్రముఖులు..**

బస్సు యాత్రకు ప్రముఖులు తరలివస్తున్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా, మంత్రులు మేరుగు నాగార్జున, గుమ్మనూరు జయరాం, ఎంపీ నందిగం సురేష్, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా నుంచి మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శంకర నారాయణ, సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి తదితరులు హాజరవుతారు.

# ఆ ఐదెకరాలు ప్రభుత్వ భూమే

- ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఎస్కేయూ క్యాంపస్ ప్రహరీ నిర్మాణం
- రెవెన్యూ అధికారులు గుర్తించి నోటీసు జారీ చేసినా పట్టించుకోని వర్సిటీ ఉన్నతాధికారులు
- తాజాగా భూ- ఆక్రమణ 1905 చట్టం కింద స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు
- పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఆ భూమి కేటాయిస్తే నానా యాగీ చేస్తున్న ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా



జగనన్న లే ఔట్‌కు కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్

**అనంతపురం:** పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అడ్డు తగులుతూ నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో భూ కబ్జాకు పాల్పడుతున్నారనే అసత్యపు కథనాన్ని ఎల్లో మీడియా వండి వార్చింది. ఈ అడ్డగోలు కథనం ప్రచురితమైందే తడవుగా పరిటాల సునీత, శ్రీరామ్ ముసుగులో టీడీపీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు అక్కడ ఏదో జరిగిపోయిందనే రీతిలో గగ్గోలు పెట్టి నాటకం రక్తి కట్టించాలని ప్రయత్నించారు. అసలు విషయం తెలిశాక తోక ముడిచారు.

**అసలు ఏమి జరిగిందంటే...**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో 2016లో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. సర్వే నంబర్ 289-1లో 5 ఎకరాలు, 289-2లో 5 ఎకరాలు, 289-3లో 7.60 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 289 - 3 సర్వే నంబర్‌లోని 7.60 ఎకరాలు మాత్రమే ఎస్కేయూనివర్సిటీ (అప్పట్లో ఎస్వీ పీజీ కళాశాల)కు అప్పగించినట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. అయితే 289-2 సర్వే నంబర్‌లో 5 ఎకరాలు, 289-1లో 5 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉంది. 2016లో ప్రహరీ నిర్మాణం చేపట్టే క్రమంలో 7.60 ఎకరాలతో పాటు 289-2 సర్వే నంబర్‌లో ఉండే 5 ఎకరాల భూమిని అనధికారికంగా కలుపుకుని నిర్మాణం చేపట్టారు. ఈ 5 ఎకరాలు వర్సిటీకి అప్పగించినట్లు ఎక్కడా జీఓ జారీ చేయలేదు. అప్పట్లో వర్సిటీకి అప్పగించిన భూమికి సంబంధించి జీఓ నంబర్ 100, ఫిబ్రవరి 5, 1969లో జారీ అయింది. ఇందులో ఈ 5 ఎకరాల భూమి ప్రస్తావనే లేదు. ప్రభుత్వ అధీనంలోనే ఉందనడానికి ఈ జీవోనే నిదర్శనం. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు పలు దఫాలుగా యూనివర్సిటీకి నోటీసులు జారీ చేశారు. అయినా వర్సిటీ అధికారులు స్పందించలేదు. గత వీసీకి ఫిర్యాదు చేశారు. దీంతో వర్సిటీ క్యాంపస్ బయట ఉండే 5 ఎకరాలను రెవెన్యూ వారికి, క్యాంపస్ లోపల ఉండే ప్రభుత్వ భూమిని వర్సిటీకి బదలాయించేలా రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యర్థిస్తూ ఎస్కేయూ పాలకమండలి ఎజెండాలో చేర్చారు. అయితే అప్పటి నుంచి పాలకమండలి సమావేశం జరగకపోవడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు. తాజాగా 289-2 సర్వే నంబర్‌లోని 5 ఎకరాల భూమిలో 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం కింద పేదవారికి ఇంటి పట్టాలు ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే భూమిని చదును చేస్తున్న అంశాన్ని వక్రీకరించి వైఎస్సార్‌సీపీ నాయకులపై బురద జల్లే కార్యక్రమం చేశారు.

**పేదలకు పట్టాలు ఇవ్వడమే తప్పా?**

ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు, యూనివర్సిటీ అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వ భూమిని 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' కింద పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. అత్యంత విలువైన భూమిని పేదవారికి ఇస్తే తమకు ఓట్లు దక్కవనే అక్కసుతో పరిటాల సునీత, శ్రీరామ్ రెచ్చగొట్టి ఆందోళన చేయించే కార్యక్రమాన్ని నిర్వహించారని పేదలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ భూమి అని తెలిసినా ప్రహరీ నిర్మాణం చేపట్టిన యూనివర్సిటీ అధికారులది తప్పా? పేదవారికి ప్రభుత్వ భూమి ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వ అధికారులది తప్పా? అని ఆలోచించుకోవాలని పేదవారు కోరుతున్నారు.

**90 ఎకరాల ఎస్కేయూ భూమి పరిరక్షణ..**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి 482 ఎకరాలు కేటాయించారు. ఈ మేరకు ఫిబ్రవరి 5, 1969న రాష్ట్ర ప్రభుత్వం జీఓ 100ను జారీ చేసింది. ఇందులో కొంత భూమి ఆక్రమణకు గురైంది. ఈ నేపథ్యంలో గత వీసీ చొరవ తీసుకుని మొత్తం భూమినంతా సర్వే చేయించారు. ఇందులో 90 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తేలింది. వెంటనే ఆ భూమిని పరిరక్షించి చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఎస్కేయూకు సంబంధించిన 90 ఎకరాల భూమిని పరిరక్షించిన ఘనత దక్కింది.

**ఆ భూమి పేదలకు కేటాయించాం**

ఇటుకలపల్లి సర్వేనంబర్ 289-3లో 7.60 ఎకరాలు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి కేటాయించారు. 289-2లో 5 ఎకరాలు యూనివర్సిటీకి కేటాయించలేదు. అది ముమ్మాటికీ ప్రభుత్వ భూమే. ఈ భూమిని 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం కోసం అప్పగించాం. విధులకు ఆటంకం కలిగించే రీతిలో ఎవరు అడ్డుకున్నా చట్టపరంగా చర్యలు తప్పవు.

– కె.విజయలక్ష్మి, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం

# నేత్రపర్వంగా షంషీర్



షంషేర్ ఉత్సవంలో పాల్గొన్న దర్గా పీఠాధిపతులు

- కిటకిటలాడిన దర్గాహొన్నూరు
- మతసామరస్యానికి ప్రతీక

**బొమ్మనహాళ్:** జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు స్వామి ఉత్సవాల్లో షర్మస్ హుస్సేనీ షంషీర్ ఉత్సవం ఆదివారం ఘనంగా సాగింది. తెల్లవారుజామున గుర్రంపై షంషీర్‌ను భారీ ఊరేగింపు మధ్య దర్గా వద్దకు చేర్చారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తులతో దర్గాహొన్నూరు కిటకిటలాడింది. హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీగా నిలిచింది.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

## క్లుప్తంగా

### 'ఆడుదాం ఆంధ్రా'ను జయప్రదం చేయండి

• మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం...ఆంధ్రా' క్రీడా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యువతకు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్త క్రీడాకార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని పెద్ద వేదికకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాల్లో ఆసక్తి ఉన్న 15 ఏళ్ల పైబడిన వారు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వీరికి సచివాలయాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు నిర్వహించి మొత్తంగా రూ.12 కోట్లకు పైగా ఉత్తేజకరమైన బహుమతులను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. పేర్ల నమోదుకు 'ఆడుదాం ఆంధ్రా.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చునని లేదా సమీపంలోని సచివాలయం కానీ, 1902కు కాల్ చేసి గాని నమోదు చేసుకోవాలని సూచించారు.

### మరో మూడు రోజులు వానలు

పుట్టపర్తి అర్బన్: 'మిచాంగ్' తుపాను ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ శ్రీసత్యసాయి జిల్లాలోని 10 మండలాల్లో వర్షం కురిసింది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఓడీ చెరువు మండలంలో 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎన్పీ కుంట మండలంలో 4 మి.మీ, నల్లచెరువు- 3.2, తలుపుల, తనకల్లు- 2.4, గాండ్లపెంట, ముదిగుబ్బ- 2, పుట్టపర్తి- 1.6, బుక్కపట్నం, కొత్తచెరువు- 1.4 మి.మీ మేర వర్షం కురిసింది. కాగా, రాబోవు మూడు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉందని, రైతులు అప్రమత్తమై పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

## ● కార్తికేయ నమో నమః







ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) స్వామి బంగారు కవచంతో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సతీమణి మనోరమ, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

• భక్తులతో కిటకిటలాడిన పంపనూరు
• దర్శనానికి గంటల సమయం

ఆత్మకూరు: కార్తీక మాసం బహుళ షష్టిని పురస్కరించుకుని ఆదివారం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కార్తికేయుడి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రీవారి దర్శనానికి గంటల సమయం పట్టింది. కుంకుమార్చనలు, పాలాభిషేకాలు పెద్ద ఎత్తున జరిగాయి. తులసీదామోదర కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆకు పూజ, స్వరణ కవచ సేవ, మహా మంగళ హారతి తదితర పూజాదికాలను అర్చకులు రాము, సాయి తదితరులు వైభవంగా నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మంజునాథ స్వామి, పార్వతీ దేవి ఉప ఆలయాల్లో విశేష అలంకరణలు, పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించేందుకు మహిళలు పోటీ పడ్డారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ అక్కిరెడ్డి పర్యవేక్షించారు.

**పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి..**

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రాన్ని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సతీమణి మనోరమ, కుమార్తె ఇందిరాప్రియ సందర్శించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి బంగారు కవచంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గో పూజలో పాల్గొని ఆహారం అందించారు.

అనంతరం రాత్రి కోటి దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఎస్కే యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు తోపుదుర్తి నయనతారెడ్డి పాల్గొని జ్వాలా తోరణాన్ని వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, సర్పంచ్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే బ్రాహ్మణుల అభివృద్ధి

• ఏపీబీఎస్ఎస్ అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని బ్రాహ్మణులకు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ సూచించారు. అనంతపురంలోని ఆదర్శనగర్‌లో ఉన్న బెస్తవారి కల్యాణ మంటప ప్రాంగణంలో ఆదివారం బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వన భోజనాలు సందడిగా జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి దుర్గాప్రసాద్‌తో పాటు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆర్‌కే శేషగిరిరావు, కోశాధికారి మనోహర్, అధికార ప్రతినిధి నార్పల మారుతి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గాయత్రి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. శాఖా విబేధాలు మాని అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు రుద్రాభిషేకం, అక్షర కోటి గాయత్రి జపం, వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి నిర్వహించారు. అనంతకు విచ్చేసిన రాష్ట్ర నాయకులను, ప్రముఖ రంగస్థల కళాకారుడు వరప్రసాద్‌ను ఈ సందర్భంగా నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకేశుల సత్యనారాయణ, పట్నం విశ్వేశ్వరరావు, సీవీ మురళీధర్, కృష్ణమూర్తి, నాట్యాచార్యులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌కు అండగా నిలుద్దాం

• 98 ఎంటీఎస్ టీచర్ల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పాతికేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న డీఎస్సీ-98 అభ్యర్థుల సమస్యను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రాబోవు ఎన్నికల్లో గెలిపించాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురంలోని లక్ష్మీ సినర్జీ స్కూల్‌లో ఆదివారం ఉదయం ఉమ్మడి జిల్లా 98 ఎంటీఎస్ టీచర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఎంటీఎస్ టీచర్ల కుటుంబాలన్నీ మద్దతుగా నిలవాలని కోరారు. 98 ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో 98 ఎంటీఎస్ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్తాల బాలిరెడ్డి, రాష్ట్ర న్యాయ సలహాదారు కృష్ణ రంగారెడ్డి, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు చింతా రామకృష్ణ, ఉమ్మడి అనంత జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆర్.రామాంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు, గౌరవ సలహాదారులు చెన్నకేశవులు, టి.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనవాక్కు

### ఇంటి వద్దకే సంక్షేమం



జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. పేదలకు మంచి చేసే ప్రభుత్వ పాలనలో మేముండడం గర్వంగా భావిస్తున్నాం. సిఫారసులు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి చేకూరుస్తున్నారు. నాకు ఏటా 13,500 చొప్పున రైతు భరోసా లబ్ధి చేకూరింది. ఏడో తరగతి చదువుతున్న నా కుమారుడు పేరుతో అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు చొప్పున అందుతోంది. మా అమ్మ ఓబులమ్మకు పింఛన్ అందుతోంది. అన్నింటి కంటే ముఖ్యం జగన్ పాలనలో నాలుగేళ్లూ మంచి వర్షాలు కురిసి కరువు అనేది లేకుండా పోయింది. ఇలాంటి పాలన కలకాలం ఉండాలని కోరుకుంటున్నా.

– కొత్తపల్లి శ్రీనివాసులు, కొనకొండ్ల, వజ్రకరూరు మండలం

### ఎన్నటికీ మరువలేం



సీఎం వైఎస్ జగన్ పాలన ఎన్నటికీ మరువలేనిది. ఎనిమిదో తరగతి చదువుతున్న నా కూతురుకు అమ్మ ఒడి పథకం వర్తింపజేస్తూ ఏటా రూ.15వేలు చొప్పున అందజేశారు. మా నాన్న చంద్రాచారికి పింఛన్ అందుతోంది. ప్రతి నెలా ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తున్నాడు. నా భార్య వాణికి ఏటా వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ సాయం మంజూరవుతోంది. సొంతింటి కల కూడా నెరవేరింది. పేదలకు సీఎం జగన్ చేసిన మేలును ఎన్నటికీ మరువలేం.

– వడ్ల దినేష్, కొనకొండ్ల, వజ్రకరూరు మండలం

### కౌలు రైతులకు ఊరట



గత ప్రభుత్వ హయాంలో భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తే వరుస పంట నష్టాలతో సతమతమయ్యాయి. కౌలు రైతు కావడంతో పంట నష్ట పరిహారాన్ని అప్పటి ప్రభుత్వం అందించలేదు. ప్రస్తుత జగన్ ప్రభుత్వంలో కౌలు రైతులకు మహర్దశ చేకూరింది. నేను ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా.. ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.13,500 లబ్ధి చేకూరింది. ఈ మొత్తంతో పెట్టుబడి లేని వ్యవసాయం చేస్తున్నా. అంతేకాక సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాయి. గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే నేరుగా మా పంటను కొనుగోలు చేసింది. వైఎస్సార్ పింఛన్ సొమ్మును ప్రతి నెలా 1వ తారీఖున వలంటర్ ఇంటి వద్దకే తెచ్చిస్తున్నాడు. నా కుమారుడికి అమ్మ ఒడి పథకం లబ్ధి చేకూరింది. ఇంతకంటే మంచి ఏ ప్రభుత్వమూ చేయదు.

– కె.ప్రభుదాసు, వజ్రకరూరు

### సొంతింటి కల నెరవేరింది



గత ప్రభుత్వ హయాంలో సొంతింటి కోసం పలు మార్లు అర్జీలు అందజేసి విఫలమయ్యా. జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నా సొంతింటి కల నెరవేరింది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం వేగంగా సాగుతుంది. అలాగే రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందడంతో పంటల సాగుకు అప్పు చేసే భారం తప్పింది. ప్రజలకు మంచి చేసే సీఎం వైఎస్ జగన్ పాలన సదా ఉండాలని కోరుకుంటున్నా.

– కె.వెంకటేష్, వజ్రకరూరు

## ● అ'పూర్వ' కలయిక



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

బొమ్మనహాళ్: ఐదు దశాబ్దాల క్రితం 1972-73లో బెళుగుప్ప మండలం గంగవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. పూర్వ విద్యార్థి సోమశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత నాటి గురువులు నంజుండప్ప, అక్కులప్ప, హనుమంతరెడ్డి, కొండన్న, కృష్ణమూర్తి, కరిబసప్పను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ నాడు పాఠశాలలో దాదాపు 22 మంది విద్యార్థులు ఉండగా ఇందులో 12 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడడం తమకెంతో గర్వకారణమన్నారు. మిగిలిన వారు సైతం ప్రైవేట్ ఉద్యోగ, వ్యాపారాల్లో రాణిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివన్న, వెంకటేశులు, ఎర్రిస్వామి, శ్రీరాములు, అల్లాబకాష్, భీమలింగ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు ఏకమవుదాం



భోజనాలు వడ్డిస్తున్న మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

• అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్
• ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం
• తరలివచ్చిన బలిజ కులస్తులు

అనంతపురం టవర్‌క్లాక్: ఐక్యతతోనే ఏదైనా సాధ్యమవుతుందని, ఈ నేపథ్యంలో బలిజలందరూ హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి రావాలని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలోని అశ్వత్థనారాయణస్వామి ఆలయం వద్ద ఆదివారం రాయలసీమ బలిజ మహాసభ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి బలిజలు తరలివచ్చారు. రాయలసీమ బలిజ మహాసభ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాజుల పద్మజ ఆధ్వర్యంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మహా శివుడికి పాలాభిషేకం చేశారు. అంతకు ముందు సోములదొడ్డి అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఊరేగింపుగా అశ్వత్థనారాయణ స్వామి ఆలయ ప్రాంగణానికి చేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి శ్రీనివాస్, గాజుల పద్మజ, టౌన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి, అనంతపురం నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాయలసీమ బలిజ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు పాములరాయి వెంకటేశ్వర్లు, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఉన్న బలిజలు రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకమవుదామంటూ పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో బలిజ మహాసభ గౌరవాధ్యక్షుడు బళ్లారి వెంకట్రాముడు, మహిళా సభ్యులు నిత్యభారతి, గౌరీతిలోత్తమ, శంకరమ్మ, నీరజాదేవి, కృష్ణవేణి, రాజేశ్వరి, మల్లేశ్వరి, పద్మ, దీప, ఈశ్వరమ్మ, కాయగూరల లక్ష్మీపతి, కొండవీటి భావన, రాయల్ మురళి, రవికాంత్ రమణ, పావురాల శేఖర్, నాగభూషణం, సాయి భాస్కర్, రాయల్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

పెనుకొండ రూరల్: పోక్సో కేసులో పట్టుబడిన వ్యక్తిని న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. వివరాలను ఆదివారం రాత్రి ఆయన వెల్లడించారు. మూడు నెలల క్రితం పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించకుండా పోయింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో కర్ణాటకలోని నెలమంగలలో ఉన్నట్లుగా గుర్తించి పిలుచుకొచ్చారు. బాలికను పిలుచుకెళ్లిన కర్ణాటకకు చెందిన కిరణ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



జవాన్ క్రాంతికిరణ్‌కు వందన సమర్పణ గావిస్తున్న సైనికులు



క్రాంతికిరణ్ (ఫైల్)

కూడేరు: మండలంలోని ముద్దలాపురానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ కురుబ క్రాంతి కిరణ్ (32) మృతదేహానికి ఆదివారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆరేళ్ల క్రితం అసోంలోని గౌహతిలో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా చేరిన ఆయన శుక్రవారం అక్కడే భార్య హరిణితో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ముందు వెళుతున్న కారు డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుకనే ఢీకొని మృతి చెందాడు. దీంతో ఆదివారం ఉదయం స్వగ్రామానికి ఆయన మృతదేహాన్ని సీఆర్‌పీఎఫ్ అధికారులు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని కన్నీటి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొని తుది ఘట్టం వరకూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటోలో నుంచి పడి బాలిక మృతి



అలియా మృతదేహం

గుత్తి రూరల్: ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడి ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం వెంకటాంపల్లి నివాసి మహమ్మద్ బాషా కుటుంబంతో కలసి గుత్తికి వలస వచ్చి గాంధీనగర్‌లో స్థిరపడ్డాడు. ఆటో నడపడంతో పాటు బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య కుళ్లాయమ్మ, కుమార్తె ఆలియా (8)తో కలసి ప్రతి ఆదివారం స్వగ్రామానికి వెళ్లి తల్లి వద్ద గడిపి తిరిగి వచ్చేవారు. ఈ క్రమంలో ఈ నెల 3న కుటుంబసభ్యులతో కలసి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరిన మహమ్మద్ బాషా ఆటో నడుపుతుండగా పక్కనే కూర్చొన్న ఆలియా మామిళ్లచెరువు శివారులోకి చేరుకోగానే అదుపు తప్పి కిందపడి గాయపడింది. అదే ఆటోలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు చేర్చారు. తలకు బలమైన గాయం కావడంతో అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

కుటుంబ కలహాల నేపథ్యంలో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. భర్త తాగుడుకు బానిస కావడంతో ఓ వివాహిత.. భర్త గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది మరో వివాహిత... ఆస్తి పంపకాల్లో తనకు అన్యాయం చేశారంటూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు..



మృతురాలు మహబూబీ

రాయదుర్గం టౌన్: పట్టణంలోని కోతిగుట్ట కాలనీలో నివాసముంటున్న మహబూబీ(32) పదేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన సుకుమార్‌ను మతాంతర వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఇటీవల భర్త తాగుడుకు బానిసై పనీపాట లేకుండా జులాయిగా మారాడు. దీంతో కుటుంబపోషణ భారమైంది. భర్తను తాగుడు మానేయాలంటూ పదేపదే ఆమె ప్రాధేయపడినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అనంతపురం క్రైం: అనంతపురం రూరల్ పరిధిలోని ఎ.నారాయణపురం సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న మాధవి (20) ఆత్మహత్య చేసుకుంది. కూడేరు మండలం ఇప్పేరుకు చెందిన మారుతిని ఏడాదిన్నర క్రితం పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది. అనంతపురంలోని రజకనగర్‌లో నివాసముంటున్నారు. ప్రభుత్వాస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగాయి. ఆదివారం ఇద్దరూ వాదులాడుకున్నారు. ఆ సమయంలో భర్త అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత మాధవి ఇంటికి లోపలి వైపు నుంచి గడియపెట్టి తలుపులకే చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంత సేపటికీ ఆమె బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న మాధవిని గమనించి, కిందకు దించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పుట్లూరు: ఆస్తి పంపకాల్లో తనకు అన్యాయం చేశారంటూ పుట్లూరు మండలం ఓబుళాపురం నివాసి నరసింహుడు (30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాది క్రితం హైదరాబాద్‌కు చెందిన కల్పనతో ఆయనకు వివాహం జరిగింది. ఇటీవల అన్నదమ్ములకు ఆస్తి పంపకాలు చేసిచ్చారు. అయితే ఆస్తి పంపకాల్లో తనకు అన్యాయం జరిగిందంటూ మనస్తాపానికి గురైన నరసింహుడు ఆదివారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

## క్లుప్తంగా

### కిడ్నీ బాధితుడికి 'అమ్మ' ఆసరా



కిడ్నీ బాధితుడు రోహిణీ కుమార్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న రమణారెడ్డి

**అనంతపురం కల్చరల్:** నిరుపేదలను మానవత్వంతో ఆదుకుంటున్న అమ్మ సంస్థ మరోసారి దాతృత్వాన్ని చాటుకుంది. వివరాలు.. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన సాకే గురప్ప, సుంకులమ్మ దంపతుల కుమారుడైన రోహిణీ కుమార్ కిడ్నీ సమస్యతో సతమతమవుతున్నాడు. 14 ఏళ్ల వయస్సులోనే కిడ్నీ ఇన్ఫెక్షన్ రావడంతో వైద్యం కోసం తల్లిదండ్రులు ఇల్లు అమ్మేసి రూ.4 లక్షలు ఖర్చుపెట్టుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. తల్లి సుంకమ్మ తన కిడ్నీ ఇవ్వడానికి ముందుకు రాగా ఆర్డీటీ వారు కిడ్నీ మార్పిడి ఖర్చు భరిస్తున్నారు. కానీ బెంగళూరు వెళ్లేందుకు, ఇతర వైద్య ఖర్చులకు చేతిలో డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మానవత్వంతో స్పందించి ఆదివారం రూ.60 వేల నగదు సాయాన్ని అందించాడు. ఆపరేషన్ తర్వాత ఆరు నెలల పాటు నిత్యావసరాలు, మందులకు అమ్మ సంస్థ సాయమందిస్తుందని భరోసా ఇచ్చారు.

### గీతా పఠనంతో మానసిక ప్రశాంతత



గ్రామాల్లో భగవద్గీత ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

**అనంతపురం కల్చరల్:** భగవద్గీత సకల సమస్యలకు పరిష్కార మార్గం. గీతా పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి తరపున ఆదివారం నగరంతో పాటూ పలు గ్రామాల్లో గీతా ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేశారు. జీవాత్మ, పరమాత్మ, ఆత్మ అనే మూడు ధర్మాల స్థాపనపై వివరించారు. త్రైత సిద్ధాంతం గీతకు, ముఖ్యంగా పురుషోత్తమ ప్రాప్తియోగంలోని శ్లోకాలకు చెప్పిన భాష్యాలను తెలిపారు. కార్తీక దీపం అందించే ఆరోగ్య రహస్యాల విశిష్టతను వివరించినట్లు జ్ఞానవేదిక సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు పక్కీరప్ప, నీలావతి, జాహ్నవి, విజయక్క, నాగమణి, సోమశేఖర్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### కేరళ పద్ధతులు పాటించేలా చూడండి



శబరిమల సన్నిధానం అర్చకుడు రాజీవర్ తంత్రిని కలిసిన మలయాళీలు

**అనంతపురం కల్చరల్:** చెరువు కట్టపై వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో సంప్రదాయాలకు భిన్నంగా పూజలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అనంతలో స్థిరపడిన మలయాళీలు కోరారు. నగరంలో జరుగుతున్న అయ్యప్ప విగ్రహ పునఃప్రతిష్టల్లో పాల్గొనడానికి విచ్చేసిన రాజీవర్ తంత్రిని నందకుమార్ నేతృత్వంలో కేరళవాసులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1977లో నగరంలో ఎంతో మంది ఇక్కడ స్థిరపడిన మలయాళీలు చందాలు పోగుచేసి శ్రీ అయ్యప్ప సేవా సమాజ్ పేరిట ఆలయాన్ని నిర్మిస్తే ప్రస్తుత కమిటీలో అందరిని దూరం పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇటీవల శింగనమల ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డిని కలిసినట్లు తెలిపారు. ఇందుకు వారు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం రాజీవర్‌తంత్రిని అనంత మలయాళీలు ఘనంగా సత్కరించారు.

### పౌష్టికాహారం అందించాలి



హాస్టళ్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఇటీవలే ప్రారంభించిన నూతన హాస్టల్‌ను విద్యార్థులను కేటాయించాలని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ అధికారులను ఆదేశించారు. వర్సిటీలో ఆదివారం వీసీ పలు హాస్టళ్లను సందర్శించారు. విద్యార్థుల కోరిక మేరకు మెనూలో మార్పు చేయాలని సూచించారు. రుచికరమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.

# రైలు పట్టాలపై మృత్యుఘోష

ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనలు కొన్ని అయితే.. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది మరికొందరు రైలు చక్రాల కింద నలిగి తనువు చాలిస్తున్నారు. రైళ్లల్లో ప్రయాణించేటప్పుడు సరదాగా సెల్ఫీ తీసుకునే క్రమంలో కొందరు మృత్యువాత పడుతున్నారు. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సవాల్‌గా తీసుకోలేక, మానసికంగా కుంగిపోయి నిండు జీవితాలను అర్ధంతరంగా చిదిమేసుకుంటున్నారు. ఇలా నిత్యం ఏదో ఒక రూపంలో రైలు పట్టాలపై ప్రాణాలు కోల్పోతున్నారు. ఫలితంగా తమపై ఆధారపడ్డ వారిని అనాథలను చేసి లోకం నుంచి నిష్క్రమిస్తున్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

- అనంతపురం రైల్వే స్టేషన్ పరిధిలో నాలుగేళ్లలో 81 మంది బలవన్మరణం
- ప్రమాదాలకు గురై మరో 44 మంది మృత్యువాత
- ఆర్థిక, అనారోగ్య సమస్యలే ప్రధాన కారణం

- అనంతపురం మండలం సోమలదొడ్డికి చెందిన వెంకటరామిరెడ్డి (64) కొన్నేళ్లుగా ఆస్తమాతో బాధపడేవారు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాకపోగా, ఊపిరితిత్తుల సమస్య కూడా తోడుకావడంతో మానసికంగా కృంగిపోయేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన నవంబర్ 22న అనంతపురం–తాటిచెర్ల మార్గమధ్యంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- అనంతపురంలోని నందమూరి నగర్‌కు చెందిన షామీర్‌బాషా (31) మెకానిక్‌గా పని చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో పాటు తల్లిదండ్రులను పోషించుకునేవాడు. చాలీచాలని ఆదాయంతో కుటుంబ పోషణ భారం కావడంతో తెలిసిన చోట్ల అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం తెలియకపోగా, అప్పుల వారి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఏం చేయాలో దిక్కుతోచక అక్టోబర్ 19న రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

ఈ ఘటనల్లో ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలు వీధినపడ్డాయి. ఇవి ఉదాహరణలు మాత్రమే. ఇటువంటి ఘటనలు జిల్లా వ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. వీటికి అంతం ఎప్పుడో అర్థం కావడం లేదు.



ప్రతీకాత్మక చిత్రం

**అనంతపురం సిటీ:** అనంతపురం రైల్వే స్టేషన్ పరిధిలో ఆత్మహత్యలు అంతకంతకూ పెరుగుతున్నాయి. రైల్వే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా తక్కువేం ఉండట్లేదు. నాలుగేళ్లలో మొత్తం 125 మంది మరణించారు. అందులో 81 మంది గూడ్స్, రైళ్ల కింద దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు రికార్డుల ప్రకారం తెలుస్తోంది. మరో 44 మంది ప్రమాదశాత్తు గూడ్స్, రైళ్ల కింద పడి మరణించినట్లు స్పష్టమవుతోంది.

### అనారోగ్య కారణాలతో ఆత్మహత్యలు

దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు పోలీస్ రికార్డుల స్పష్టమవుతోంది. దీనికి పేదరికం కూడా ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఆర్థిక సమస్యలతో మెరుగైన వైద్యం చేయించుకోలేక, కుటుంబ సభ్యులకు భారం కాలేక.. రైళ్ల కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోందని రైల్వే పోలీసులు చెబుతున్నారు.

### సకాలంలో స్పందిస్తూ.. ప్రాణాలు కాపాడుతూ..

తమకు ఎదురైన సమస్యలను చూసి కుంగిపోవడం, ఆత్మహత్యలే శరణ్యంగా భావించి రైలు కింద దూరి తనువు చాలించాలనుకుని గూడ్స్, రైళ్లు వచ్చే సమయానికి పట్టాలపైకి చేరుకునే వారిలో కొందరిని రైల్వే పోలీసులు కాపాడుతున్నారు. సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి రైల్వే పోలీసులు రక్షిస్తున్న సందర్భాలూ లేకపోలేదు. ఆ విధంగా ఒక్కో ఏడాదిలో కనీసం 10 మందిని పోలీసులు సకాలంలో రక్షించిన ఘటనలు ఉన్నాయి. అటువంటి వారిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇవ్వడం, వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించారు.

**నాలుగేళ్ల రికార్డుల ప్రకారం..**

| సంవత్సరం | ఆత్మహత్యలు | ప్రమాదాలు | మొత్తం |
|---|---|---|---|
| 2020 | 15 | 11 | 26 |
| 2021 | 33 | 10 | 43 |
| 2022 | 13 | 16 | 29 |
| 2023 | 20 | 07 | 27 |
| మొత్తం | 81 | 44 | 125 |

### యుక్త వయస్సు వారే అధికం



2022 సంవత్సరంలో ఆత్మహత్య చేసుకున్న వారిలో 20–40 ఏళ్ల వయస్సు వారే ఎక్కువగా ఉన్నారు. 2023లో 40–60 ఏళ్ల లోపు వారు అత్యధికంగా బలవన్మరణానికి ఒడిగట్టారు. తమకొచ్చిన చిన్న చిన్న సమస్యలను సైతం పరిష్కరించుకునే ఆలోచన లేక.. చాలా మంది గూడ్స్, రైళ్ల కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు మా విచారణలో తేలింది. – విజయకుమార్, జీఆర్పీ ఎస్ఐ, అనంతపురం

### ఆత్మహత్య పరిష్కారం కాదు



అన్ని జన్మల్లోకెల్లా మానవ జన్మ ఉత్తమమైంది. తమకొచ్చిన సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదు. ఆత్మహత్య చేసుకుంటే అప్పటి వరకు తమపై ఆధారపడ్డ భార్యాబిడ్డలు, వృద్ధ తల్లిదండ్రులు ఏమై పోతారో అని ఆలోచించక పోవడం దురదృష్టకరం. ఈ విషయంపై చైతన్యం తీసుకువచ్చే దిశగా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విరివిగా సదస్సులు నిర్వహిస్తున్నాం. జీవితంపై విరక్తి చెందిన వారిని, సమస్యలతో కుంగిపోయే వారిని సకాలంలో గుర్తించేది కుటుంబ సభ్యులే కావడంతో అటువంటి వారికి ధైర్యం చెప్పాలి. లేకపోతే మానసిక వైద్యులను సంప్రదించాలి. – డాక్టర్ హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

### బస్సుయాత్ర బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

**రాప్తాడు:** స్థానిక బస్టాండు సర్కిల్లో సోమవారం జరగనున్న సామాజిక బస్సు యాత్ర బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డ్ చెర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. అక్కడే ప్రెస్ గ్యాలరీ, నాడు–నేడు పనుల ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. బస్సుయాత్రకు ముందు నిర్వహించనున్న బైక్ ర్యాలీపై నాయకులతో చర్చించారు. బహిరంగ సభకు భారీగా తరలిరావాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అలాగే అనంతపురం రూరల్, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, ఆత్మకూరు, రాప్తాడు మండలాల నుంచి వచ్చే వాహనాలను రాప్తాడులోని ఆటో నగర్ స్థలంలో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరు మండలాల నుంచి దాదాపుగా 20 వేలకు పైగా వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు బాలనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'స్పందన'

**అనంతపురం కార్పొరేషన్:** నగర పాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు స్పందన జరగనుంది. నగరంలోని వివిధ డివిజన్లలోని ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని నగరపాలక సంస్థ అధికారులు ఆదివారం తెలిపారు. ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర అధికారులు స్పందనలో పాల్గొంటారని పేర్కొన్నారు.

# రాప్తాడులో వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య
- త్వరలో ఆత్మకూరులో బహిరంగ సభ నిర్వహిస్తాం
- బస్సుయాత్ర జయప్రదం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

**ఆత్మకూరు:** రానున్న ఎన్నికల్లో రాప్తాడులో అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. పరిటాల సునీత ఓ అబద్ధాల పుట్ట అని.. మోసపూరిత మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తారని ఎద్దేవా చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్యకు పరిష్కారం చూపామని తెలిపారు. పీఏబీఆర్ నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరు, అనంతపురం రూరల్‌కు నీరు ఇచ్చి ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. త్వరలోనే ఆత్మకూరులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### బస్సుయాత్రకు తరలిరండి

రాప్తాడు మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రకు ప్రతి ఒక్కరు తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెన్నోబులేసు, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీ నరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచ్ ఎర్రిస్వామి, నాయకులు వెంకట్రాముడు, వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, ముత్యాలన్న, పెద్ద కొండారెడ్డి, ఫణిరెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ముత్యాలరెడ్డి, బాలస్వామి రెడ్డి, రామాంజి, నరసింహులు, వెంకటేష్, ఓబీ టైలర్ వెంకటేష్, హనుమంతు నాయక్, రాము నాయక్, పోతన్న, ఓబయ్య, గోపాల్, వెంకటేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సుయాత్ర విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**రామగిరి:** వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేద్దామని ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. రాప్తాడు మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం సామాజిక సాధికార బస్సుయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

**రాప్తాడు:** మండల కేంద్రంలో సోమవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. బడుగులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నామినేటెడ్ పదవులు ఇచ్చారని కొనియాడారు. కులమతాలు చూడకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ సమన్యాయం పాటిస్తున్నారన్నారు. రాప్తాడులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. బస్సు యాత్ర ముందే 2 గంటలకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. మండలంలో యువత రెండు గంటలకే రాప్తాడు చేరుకుంటే ర్యాలీ ప్రారంభిస్తామన్నారు. ర్యాలీ అనంతరం బస్సు యాత్ర స్థానిక బస్టాండు నుంచి డాన్ బోస్కో స్కూల్, ఆర్డీటీ కార్యాలయం, సిరికల్చర్ కార్యాలయం మీదుగా గంగలకుంట రోడ్డు నుంచి 44వ జాతీయ రహదారి మీదుగా వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న, కిరణ్ కుమార్, పుల్లలరేవు అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలు ఇస్తే ఓర్చుకోలేరా?



నిరసన తెలుపుతున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

**అనంతపురం:** నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇస్తుంటే పరిటాల సునీత అనుచరులు రాద్ధాంతం చేయడం సబబు కాదని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇస్తే ఓర్వలేనితనంతో వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల తీరుపై ఎస్కేయూలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 289–2 సర్వే నంబర్‌లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కలుపుకుని వర్సిటీ అధికారులు అవగాహన లేకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఇదే అంశంపై వర్సిటీ ఉన్నతాధికారులకు రెవెన్యూ అధికారులు పలు దఫాలుగా నోటీసులు జారీ చేసినప్పటికీ ప్రభుత్వ భూమిని అప్పగించ లేదు. తాజాగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇంటి పట్టాలు ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు భూమిని ఆధీనంలోకి తీసుకుని ఫెన్సింగ్ వేశారు. 560 మంది నిరుపేదలకు ఇంటిపట్టాలు ఇచ్చే కార్యక్రమం చూసి సంతోషించాల్సింది పోయి రాప్తాడు ఎమ్మెల్యే తోపదుర్తి ప్రకాష్ రెడ్డిపై బురదచల్లడం సిగ్గుచేటన్నారు. ఇందులో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే ఇంటి పట్టాలు దక్కుతున్నాయని తెలిపారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేదల పక్షపాతి అని ఈ అంశమే నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా హుందాగా నడుచుకోకుండా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోబమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హేమంత్ కుమార్, చిగండి రమేష్, తేజేశ్వర రెడ్డి, సురేష్, ఎంపీటీసీ సునీల్ దత్తా రెడ్డి, రూరల్ మండలం యూత్ కన్వీనర్ తాడిపత్రి శ్రీనివాసులు, సాకే ఆనంద్, నరేష్, చంద్ర, నల్లప్ప పాల్గొన్నారు.




## సంక్షిప్త సమాచారం

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**రాప్తాడురూరల్:** బళ్లారి రోడ్డులోని ఎస్టేట్ ప్రాంతంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,41,850 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలో ఎక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా వెంటనే 94407 96811 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

**అనంతపురం కార్పొరేషన్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి నగరంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు జరిగాయి. ఆదివారం నగరంలోని జీసస్ నగర్, అశోక్‌నగర్ పోలింగ్ కేంద్రాలను కమిషనర్ భాగ్యలక్ష్మి పరిశీలించారు. నమోదు, తొలగింపు, చిరునామా బదిలీ క్లెయిమ్స్, అభ్యంతరాలు ఏ మేరకు వచ్చాయని ఆరా తీశారు. నిబంధనల మేరకు ఓటర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు.

### ఆర్యవైశ్య సంఘం జిల్లా అదనపు కార్యదర్శిగా మంజునాథ్

**అనంతపురం కల్చరల్:** ఆర్యవైశ్య సంఘం జిల్లా అదనపు కార్యదర్శిగా నగరానికి చెందిన సత్రసాల మంజునాథ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం రాజు రోడ్డులోని వైశ్యా హాస్టల్ ప్రాంగణంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శిరిగుప్ప వెంకటేశ్వర్లు, సెక్రటరీ పోతుల మనోజ్ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి మంజునాథ్ పూర్తిగా కృషి చేస్తారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా కూడా పని చేస్తున్న మంజునాథ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేసి సత్కారించారు.

### బీజేపీ నాయకుల సంబరాలు



స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకులు

**అనంతపురం టవర్‌క్లాక్:** దేశ వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడంతో స్థానిక బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో రాజస్తాన్, ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్‌లో విజయం సాధించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి నిదర్శనమన్నారు. ప్రజలు బీజేపీ పార్టీకి మద్దతుగానే ఉన్నారన్నారు. కార్యక్రమంలో లలిత్‌కుమార్, అశోక్‌రెడ్డి, సూర్య ప్రకాష్, దేవిరెడ్డి లక్ష్మీదేవమ్మ, రత్నమయ్య పాల్గొన్నారు.

### నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరగనుంది. నగరంలోని 31వ సచివాలయం సాయినగర్, 45వ సచివాలయం అరవింద నగర్, 55వ సచివాలయం రాంనగర్, 33వ సచివాలయం మున్నానగర్ ప్రాంతాల్లో వై ఏపీ నీడ్స్ కార్యక్రమం నిర్వహించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు, స్థానిక కార్పొరేటర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ, అభివృద్ధి బోర్డులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగువేయనున్నారు.

### పట్టణాల్లోనూ 'ఉపాధి' కల్పించాలి

**అనంతపురం అర్బన్:** కరువు తీవ్రత దృష్ట్యా పట్టణ ప్రాంతాల్లో జాతీయ పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన పట్టణ ప్రాంత సీపీఎం శాఖ కార్యదర్శుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువుతో గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక కూలీలు పట్టణాలకు వలస వస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ.. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులను ప్రభుత్వం అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, జగన్, అచ్యుత్, మల్లికార్జున, వెంకటనారాయణ, ముస్కిన్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎల్కేపీలో ఘంటసాల జయంతి

**అనంతపురం కల్చరల్:** స్థానిక లలిత కళాపరిషత్తులో సోమవారం సాయంత్రం 6:30 గంటలకు అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి నిర్వహిస్తున్నట్లు ఎల్కేపీ కార్యదర్శి పద్మజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత విభావరి వారి ఆధ్వర్యంలో సాగే సంగీతోత్సవాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

